క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని జిల్లాకు చెందిన సీనియర్ ఉర్దూ జర్నలిస్టు అబ్దుల్ రఫీ జికీ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

చిన్నచింతకుంట: కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం పార్టీ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మైపాల్, సీనియర్ నాయకుడు నర్సింహులు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి సీఎం అయితే తిరుమలకు పాదయాత్రగా వస్తామని మొక్కుకున్నామని వారు తెలిపారు. ఈనెల 14న పాదయాత్ర ప్రారంభించామని తెలిపారు. శనివారం నెల్లికొండి, వడ్డేమాన్, చిన్నచింతకుంట గ్రామాలమీదుగా వారి పాదయాత్ర సాగింది.

అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ అధికారులు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొత్తగా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివేంద్ర ప్రతాప్‌ను శనివారం కలెక్టరేట్‌లో పాలమూరు మున్సిపల్ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ డి.ప్రదీప్ కుమార్, ఏఎంసీ పవన్‌కుమార్, ఎంఈ బస్వరాజ్, మేనేజర్ వెంకటేశ్వర రావు, ఇన్‌చార్జ్ ఆర్‌ఓ నర్సింహులు, ఆర్‌ఐ ముజీబుద్దీన్, జేఏఓ తిరుమలేష్, మెప్మా డీఎంసీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

జడ్చర్ల టౌన్: ఆరుగ్యారంటీల్లో ఒకటైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసినందుకు జనతా రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకుడు జహంగీర్ ఆధ్వర్యంలో మహిళలు సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకుడు అయ్యన్న పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ ముగింపు

జడ్చర్ల టౌన్: చేయూత రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇందిరానగర్ కాలనీలో నిర్వహించిన టైలరింగ్, మగ్గం వర్క్ ఉచిత శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షురాలు మార్తడేవిడ్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. 60మంది టైలరింగ్, 25మంది మగ్గం వర్క్ శిక్షణకు హాజరయ్యారని వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారు స్వయం ఉపాధి కల్పించుకునేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. శిబిరంలో రఫియాబేగం, లత, నిషాంతి శిక్షణ ఇచ్చారు.

నాలుగు రోజులపాటు 'భగీరథ' నీళ్లు బంద్

మహమ్మదాబాద్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నాలుగురోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఏఈ అనిల్‌కుమార్ వివరాలు తెలిపారు. పరిగి నుంచి మహమ్మదాబాద్‌కు సరఫరా చేసే పైపులైన్ ఉన్నచోట హైవేరోడ్డు పనులు చేస్తున్నందున అంతరాయం కలగనున్నట్లు వివరించారు. నంచర్ల గేట్ దగ్గర కల్వర్టు బ్రిడ్జి నిర్మిస్తున్న స్థలంలో మిషన్ భగీరథ పైపులైను తొలగించి మరోవైపు ఏర్పాటు చేసేందుకు నాలుగురోజులు సమయం పడుతుందన్నారు. గాధిర్యాల్, నంచర్ల మినహా అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా కాదని ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సర్పంచ్‌లు, అధికారులు దృష్టి సారించాలని కోరారు.

366 మందికి వైద్య పరీక్షలు...



గండేడ్: మండల కేంద్రంలో నిర్వహించిన శిబిరంలో 366 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. శనివారం టీబీ వైద్య శిబిరం నిర్వహించగా ఉమ్మడి మండలం లోని గ్రామాల ప్రజలు వినియోగించుకున్నారు. వైద్యాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శిబిరం కొనసాగింది. జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి రఫీక్, వైద్యాధికారి శిల్పచక్ర , సీహెచ్‌ఓ రాములు, బాల్‌రాజ్, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ జోన్‌లో కలపాలి

గండేడ్/మహమ్మదాబాద్: గండేడ్, మహమ్మదాబాద్ మండలాలను చార్మినార్ జోన్‌లో కలపాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో శనివారం మాట్లాడారు. మండలాలను మహబూబ్‌నగర్ జిల్లాలో కలిపారని.. దీంతో జోగుళాంబ జోన్‌లో ఉండడంతో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. దీంతో రెండు మండలాల్లోని నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

'అప్‌డేట్' కష్టాలు



ఆధార్‌అప్‌డేట్‌కోసం పడిగాపులు గాస్తున్న ప్రజలు

- ఆధార్ సెంటర్ల వద్ద జనాల తిప్పలు
- జడ్చర్లలో రెండే కేంద్రాలు
- వాటిలో సమయపాలన అంతంత మాత్రమే!

జడ్చర్ల టౌన్: ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలకు తిప్పలు తప్పటం లేదు. మున్సిపాలిటీ పరిధిలో టెలిఫోన్ కార్యాలయం, పోస్టాఫీసు కేంద్రాల్లో మాత్రమే అప్‌డేట్ చేస్తుండటంతో పడిగాపులు తప్పటం లేదు. నియోజకవర్గంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం అప్‌డేషన్ కోసం ప్రజలు ఇక్కడకు వస్తుండడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంక్షేమ పథకానికి ఆధార్‌కార్డు లింక్‌చేయటంతో తెల్లరేషన్‌కార్డు కలిగిన వారందరూ తమ కార్డులను అప్‌డేషన్ చేసుకోవాల్సి వస్తోంది. విద్యార్థులకు సైతం ఆధార్ కార్డు అవసరం అవుతుండడంతో వారు కార్డుల్లో ఉన్న తప్పొప్పులు సరిచేసుకోవాల్సి వస్తోంది. కాగా ఆరునెలలుగా ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ నేటికీ ఏమ్రాతం రద్దీ తగ్గటం లేదు.

10.45 గంటల వరకు తెరుచుకోని కేంద్రం..

మున్సిపాలిటీ పరిధిలోని టెలిఫోన్ కార్యాలయంలో ఉన్న ఆధార్‌కేంద్రం శనివారం 10.45గంటల వరకు తెరుచుకోలేదు. ఉదయం 8గంటల నుంచి లబ్ధిదారులు వచ్చి క్యూలో నిల్చుని వేచి చూడాల్సి వచ్చింది. ఒక్కో కేంద్రంలో రోజుకు 30కార్డులు మాత్రమే అప్‌డేట్ చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రానికి నాగర్‌కర్నూలు జిల్లాలోని వట్టెం, పాపగల్‌తో పాటు రాజాపూర్, బాలానగర్ ప్రాంతాల వారు కూడా తరలివస్తున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రాల్లో, అన్ని మీసేవాకేంద్రాల్లో అప్‌డేషన్ చేసే సౌకర్యం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

8 గంటల నుంచి వేచి ఉన్నాం..



నాగర్‌కర్నూలు జిల్లా వట్టెం నుంచి మా కుమారుడికి ఆధార్ తీసుకునేందుకు వచ్చాను. ఉదయం 8గంటల నుంచి వేచి ఉన్నా. నా భార్య కార్డులో ఫోన్‌నెంబరు మార్చుకోవాలి. నాగర్‌కర్నూలుకు వెళితే ఇక్కడకు వెళ్లమని చెప్పారు. ఇక్కడేమో 10.30గంటలు దాటినా ఇంకా ఎవరూ రాలే. మండలాల్లో, మీసేవ కేంద్రాల్లో కొత్తకార్డులు తీసుకునేందుకు, పాతవి మార్చుకునేందుకు అనుమతిస్తే బాగుంటది.

– రాంచందర్, వట్టెం

గ్రామాల్లోనే సౌకర్యం కల్పించాలి..



ఆధార్‌కార్డులో తప్పులు దిద్దుకునేందుకు నిన్నటినుంచి తిరుగుతున్నా. రోజుకు 30మందికే చేస్తున్నరంట. పొద్దుగాల రమ్మంటే ఉదయం 8గంటలకే వచ్చిన. ఇంకా తెరవలేదు. కార్డులో ఏమైనా తప్పులుంటే మా గ్రామాల్లోనే సరిచేసుకునేలా సౌకర్యం కల్పించాలి.

– కావలి నీలమ్మ, పాపగల్

సర్వసభ్య సమావేశం వాయిదా



సభలోంచి వెళ్లి పోతున్న అధికారులు, సర్పంచులు

అడ్డాకుల: మూసాపేట మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఎంపీపీ కళావతి అధ్యక్షతన శనివారం స్థానిక రైతు వేదికలో మండల సభ ప్రారంభమైంది. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, మండల కోఆప్షన్ మదీనా జమీర్, ఎంపీడీఓ స్వరూప హాజరయ్యారు. అయితే గంట వరకు ఎంపీపీ మినహా ఒక్క ఎంపీటీసీ కూడా హాజరుకాలేదు. ఐదారు గ్రామాలకు చెందిన సర్పంచులు, అధికారులు సభకు రాగా ఎంపీటీసీలు రాకపోవడంతో సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ స్వరూప ప్రకటించారు. సర్పంచులు, అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. కాగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అసెంబ్లీ ఉన్నందున రాకపోవడంతో ఎంపీటీసీలు కూడా సభకు రాలేదని తెలిసింది. ఎమ్మెల్యే సమయం కేటాయించిన తర్వాత మరోసారి సభను నిర్వహిస్తారని సమాచారం.

గ్రామపంచాయతీ భవనాలను పూర్తిచేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

కోయిల్‌కొండ: మండలంలోని పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. శనివారం మండలంలోని అనంతపూర్‌లో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న పనులను కాంట్రాక్టర్లు వెంటనే పూర్తిచేయాలన్నారు. ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



కలెక్టర్ రవినాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: గండేడ్ పరిధిలోని మన్సూర్‌పల్లికి చెందిన గోవింద్ అక్టోబర్ 25న హత్యకు గురయ్యాడు. కాగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందాల్సి ఉంది. కానీ బాధిత కుటుంబసభ్యులు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా నేటివరకు సాయం అందలేదు. దీంతో బాధితులు కేవీపీఎస్ నాయకులను ఆశ్రయించారు. కాగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, పరిగి బ్లాక్-2 కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, నాయకుడు మొగులయ్యలు వారికి అండగా నిలిచారు. శనివారం కలెక్టర్ జి.రవినాయక్‌ను కలిసి గోవింద్ కుటుంబానికి ఆర్థికసాయంతో పాటు,, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

'పది' విద్యార్థులకు రాబోయే వందరోజులు కీలకం



మాట్లాడుతున్న ఎంఈఓ మంజులా దేవీ

జడ్చర్ల టౌన్: 'పది' విద్యార్థులకు రాబోయే వందరోజులు కీలకమని ఎంఈఓ మంజులాదేవీ అన్నారు. శనివారం జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడారు. తల్లిదండ్రులు సైతం పిల్లలను పర్యవేక్షించాలన్నారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలన్నారు. ప్రతి పదిహేనురోజులకోమారైనా పాఠశాలకు వచ్చి పిల్లలు ఎలా చదువుతున్నది తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర పరిశీలకులు మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: విద్యాశాఖ ప్రవేశపెట్టిన ఉన్నతి ఎఫ్‌ఎల్‌ఎన్ తదితర బోధనాంశాల ఆధారంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాలని ధర్మాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య అన్నారు. శనివారం ధర్మాపూర్‌తో పాటు, కోడూర్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కోడూర్‌లో హెచ్‌ఎం రమేష్‌గౌడ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పూజలో పాల్గొన్న భక్తులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో గురుస్వామి కొంగరి శ్రీనివాసులు సమక్షంలో శనివారం సంకల్పసిద్ధి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మదనాపురం మండల కేంద్రానికి చెందిన గోపి గురుస్వామి గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృతాభిషేకం చేశారు. తర్వాత 18 మెట్లపై కర్పూరాలను వెలిగించి పూజ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు ఎన్‌టీగౌడ్, గురుస్వాములు కాశీనాథ్, ప్రభాకర్, విశ్వేశ్వర్ తదితరులు ఉన్నారు.

అసంపూర్తిగా పాల డెయిరీ



నర్వలో అసంపూర్తిగా ఉన్న శిథిలావస్థలో పాలకేంద్రం

నర్వ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో గతంలో నిర్మాణం చేసిన పాల డెయిరీ పూర్తిగా శిథిలావస్థకు చేరిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ కేంద్రాన్ని నిర్మాణం చేసి మహిళా సంఘాల ద్వారా రైతుల నుంచి పాలను సేకరించాలని నిర్మాణం చేపట్టారన్నారు. పాల ఉత్పత్తులను పెంచడంతోపాటు మహిళలకు ఆర్థికాభివృద్ధి సాధించే లక్ష్యంతో చేపట్టిన ఈ నిర్మాణం నిధులు లేమితో గత కొన్నేళ్లుగా అసంపూర్తిగా మిగిలిపోయిందన్నారు. ఈ కేంద్ర నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి శిథిలావస్థలో ఉన్న అసంపూర్తి పనులను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని వారు కోరుతున్నారు.

సైనికుల త్యాగాలను స్మరించుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దేశం కోసం త్యాగాలు చేసిన సైనికులను స్మరించుకోవాలని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో సైనిక్ దివాస్ నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారులు రాజేశ్వరీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యవర్గ సభ్యుడిగా శివప్రసాద్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఢిల్లీలో ఈనెల మొదటి వారంలో జరిగిన జాతీయ మహాసభల్లో జిల్లాకు చెందిన శివప్రసాద్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఈమేరకు ఆయన జాతీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడికి గాయాలు

అడ్డాకుల: కొమిరెడ్డిపల్లి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. శాఖాపూర్‌కి చెందిన నరేష్‌రెడ్డి ద్విచక్రవాహనంపై భూత్పూర్ వైపు వెళ్తున్న క్రమంలో కొమిరెడ్డిపల్లి బ్రిడ్జి వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో నరేష్‌రెడ్డి రోడ్డుపై పడిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో టోల్‌ప్లాజా అంబులెన్స్ సిబ్బంది వచ్చి క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స నిర్వహించారు. శాఖాపూర్ తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఇదిలా ఉండగా కొత్తగా వేసిన రోడ్డుపై వరుసలను సూచించే మార్జిన్ వైట్‌లైన్ లేకపోవడమే ఘటనకు కారణమని తెలుస్తోంది.

బైకు ఢీకొని మహిళకు..

మహమ్మదాబాద్: బైకు ఢీకొని మహిళ గాయపడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డిపల్లికి చెందిన రుక్కమ్మ శనివారం ఉదయం గ్రామంలో రోడ్డు దాటుతుండగా ఓగుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

బైక్ పై నుంచి పడి ఇద్దరికి..

మహమ్మదాబాద్: అదుపుతప్పి బైకుపై నుంచి పడి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన అశోక్‌మిశ్రా తన మిత్రుడితో కలిసి శనివారం సాయంత్రం మహబూబ్‌నగర్ నుంచి కుల్కచర్ల మండలం పుట్టపహాడ్‌లో ఉన్న స్నేహితుడి దగ్గరకు బయలు దేరాడు. ఈ క్రమంలో ఎదురుగా లారీ రావడంతో అతివేగంగా ఉన్న బైకు అదుపుతప్పి గుంతలో పడిపోయింది. దీంతో అశోక్‌మిశ్రాకు తీవ్ర గాయాలు కాగా అతడి మిత్రుడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఫోన్ చేయగా వారిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్టు 108 అంబులెన్సు సిబ్బంది తెలిపారు.

క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: దివ్యాంగ విద్యార్థులకు సేవలందిస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టాలని.. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని శనివారం జిల్లా కేంద్రంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డికి ఐఈఆర్‌పీలు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో మంజూరైన 1523 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టుల్లో ఇప్పటికీ పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించి, మిగిలిన వాటిని నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. అంతకుముందు హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానించారు. ఐఈఆర్‌పీలు శ్రీనివాసులు, అర్చన, రఘుబాబు, మైబన్న, పావని పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

చిన్నచింతకుంట: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కలెక్టర్ రవినాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం లాల్‌కోటలో పదోతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన విద్యాసదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. చదువుకు పేదరికం అడ్డం కాదన్నారు. తాను కూడా మారుమూల ప్రాంత గిరిజన తండాలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో చదివినట్లు వివరించారు. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు తన స్వంత నిధులతో పాటు దాతల సహకారంతో అల్పాహారం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. డీఈఓ రవీందర్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ లక్ష్మణ్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్ సింగ్, ఆర్‌ఐ తిరుపతయ్య, ఎంపీటీసీ శివరాజు పాల్గొన్నారు.

స్వయం పరిపాలనా దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థి ఉపాధ్యాయులు

గండేడ్: బల్సుర్‌గొండ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా ఒకరోజు విధులు నిర్వహించారు. తరగతులు బోధించారు. ఉపాధ్యాయులు బాల్‌రాజ్, కిరణ్‌కుమార్, సాధిక్‌హుస్సేన్, గణేష్, బాలమణి, సరిత, అంజమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు యన్మన్‌గండ్ల వాసీ



నవాబుపేట: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు యన్మన్‌గండ్లకి చెందిన ఖాజా జైనుద్దీన్ ఎంపికయ్యాడు. శనివారం ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాలుర విభాగం సెలక్షన్ కమిటీ సభ్యుడు బాలు ప్రకటన విడుదల చేశారు. కాగా విద్యార్థి ఈ నెల 22 నుంచి భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి, తండ్రి నజీబ్‌తో పాటు కోచ్ ఫర్వేజ్‌ను మండల అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

బాధితుడికి ఆర్థిక సాయం

అడ్డాకుల: మూసాపేటకి చెందిన జర్నలిస్టు బాబా ఇటీవల అనారోగ్యానికి గురై జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ శనివారం రైతు వేదిక వద్ద రూ.5వేల నగదును బాధితుడి స్నేహితుడు హఫీజ్ ద్వారా అందజేశారు. అదేవిధంగా ఇటీవల ప్రమాదానికి కోలుకుంటున్న రైల్వే ఉద్యోగి మధుయాదవ్‌ను జెడ్పీటీసీ పరామర్శించారు. సర్పంచులు చంద్రశేఖర్, లక్ష్మణ్, కోఆప్షన్ మదీనా జమీర్, నాయకులు ఉన్నారు.

బెల్టు షాపులు పూర్తిగా నిర్మూలించాలి

మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలించాలని ఆదేశాలు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి అన్నారు. శనివారం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు చిన్న, ప్రధాన కార్యదర్శి అరేందర్, కోశాధికారి ఆంజనేయులు, అధికార ప్రతినిధి రవికుమార్, యువజన విభాగం అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం: కేసు నమోదు



రాంచంద్రమ్మ

కొత్తకోట: ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని దండుగడ్డకాలనీకి చెందిన వృద్ధురాలు చెలిమిల్ల రాంచంద్రమ్మ తన కుమారులు శివారెడ్డి, చుక్కారెడ్డిలతో కలిసి ఉంటుంది. తల్లిని ఇంటి దగ్గరే ఉంచి ఈనెల 6న ఇద్దరు కుమారులు బంధువుల పెళ్లి నిమిత్తం హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులతో వెళ్లారు. తిరిగి అదే రోజు సాయంత్రం ఇంటికి వచ్చిన కుమారులకు తల్లి కనిపించకపోయేసరికి ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల వారి ఇళ్లలోకి వెళ్లి చూసినా, బంధువులకు ఫోన్ చేసి అడిగినా ఆచూకీ లభించలేదు. చుక్కారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.